## క్లుప్తంగా

### ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



మహిళలకు కుట్టు సామగ్రి పంపిణీ చేస్తున్న డాక్టర్ లావణ్య

**పాములపాడు:** ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని కుటుంబానికి ఆర్థికంగా తోడ్పాటునివ్వాలని ఆయుర్వేద వైద్యాధికారిణి లావణ్య అన్నారు. మండల కేంద్రంలో సేవాభారతి రూరల్ డెవలప్ మెంటు సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళల ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. మహిళలకు కత్తెర్లు, దారం చండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కో ఆప్షన్ ముర్తుజావలి, పీఎంసీ చైర్మన్ షేక్షావలి, వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు దంతవైద్య పరీక్షలు



విద్యార్థులకు దంతవైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అనుపమ

**ఆత్మకూరు:** బైర్లూటి చెంచుగూడెంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు బైర్లూటి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. దంత వైద్యురాలు అనుపమ మాట్లాడుతూ విద్యార్థులు తప్పనిసరిగా పళ్లను ఉదయం, రాత్రి శుభ్రం చేసుకోవాలన్నారు. దంత సమస్యలు ఉంటే సమీపంలోని దంత వైద్యశాలలో వైద్య పరీక్షలు నిర్వహించుకుని సలహాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బైర్లూటి వైద్యాధికారి పవన్‌కుమార్, వార్డెన్ శ్రీరాములు, వైద్య సిబ్బంది తులసీ తదితరులు పాల్గొన్నారు.

### ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

**పాములపాడు:** మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని తహసీల్దార్ రత్నరాధిక ఆదేశించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అనుకున్న సమయానికి లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. ప్రతి లబ్ధిదారుడితో నేరుగా మాట్లాడి తప్పని సరిగా నిర్మాణం చేపట్టేలా ప్రోత్సహించాలన్నారు. హౌసింగ్ ఏఈ శివరామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

### జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

**కొత్తపల్లి:** జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు కొత్తపల్లి విద్యార్థి ఎంపికై నట్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుబ్బారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు మురళీ నాయక్ తెలిపారు. మంగళవారం పాఠశాలలో జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన 9 వ తరగతి విద్యార్థి దుష్యంత్ కుమార్‌ను అభినందించారు. వారు మాట్లాడుతూ దుష్యంత్ కుమార్ ఫిబ్రవరి 14 నుంచి 16 తేదీ వరకు పల్నాడు జిల్లా నరసరావుపేటలో డీఎస్‌ఏ స్టేడియంలో జరిగిన అండర్ -14 వాలీబాల్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరచాడన్నారు. దీంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారని చెప్పారు.

### డబ్బు వసూళ్లపై సమాధానం చెప్పాలి



పీఎంసీ శాంతకుమారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి

**జూపాడుబంగ్లా:** పేదప్రజల అభివృద్ధి కోసం ఉద్యోగం చేయమంటే రాజకీయం చేయటం తగదని, పొదుపు రుణాల మంజూరుకు డబ్బు వసూళ్లపై సమాధానం చెప్పాలని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి మెప్మా పీఎంసీ శాంతకుమారిని నిలదీశారు. మంగళవారం ఆయన పట్టణంలోని మెప్మా కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలకు రుణాలు మంజూరు చేయాలంటే వారి వద్ద నుంచి డబ్బు వసూళ్లు చేస్తున్నట్లు సాక్ష్యాధారాలతో తన దృష్టికి వచ్చిందని చెప్పారు. అందుకు సరైన సమాధానం చెప్పకపోతే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించారు. మెప్మా, యునిసెఫ్ అధ్వర్యంలో పరిశుభ్రతే లక్ష్యంగా ఏర్పాటుచేసిన శ్యాండ్‌వాష్ యంత్రం మెప్మా అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారటాన్ని పరిశీలించిన చైర్మన్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లాలుమోమన్, రవిశంకర్, వరప్రసాదు, కాటిపోగు చిన్నరాజు, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

# పల్లెల ప్రగతికి బాటలు

- టీడీపీ హయాంలో అభివృద్ధికి నోచుకోని గ్రామాలు
- వైఎస్సార్‌సీపీ పాలనలో పల్లెపల్లెలో బీటీ, సీసీ రోడ్లు

**ఆత్మకూరు:** దేశానికి పల్లెలు పట్టుగొమ్మలు, అలాంటి పల్లెలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుంది. అయితే టీడీపీ ప్రభుత్వ పాలన గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదు. పల్లెల్లో ఎటు చూసినా గుంతలు పడిన రహదారులే దర్శనమిచ్చేవి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. సీసీ రోడ్లు, బీటీ రహదారులతో పాటు డ్రైనేజీలు నిర్మిస్తూ ముందుకు సాగుతోంది. గాంధీజీ కలలు గన్న గ్రామస్వరాజ్య స్థాపనలో భాగంగా గ్రామ సచివాలయాలకు నిధులు కేటాయించడంతో ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయి.

**సచివాలయానికి రూ.20 లక్షలు..**

శ్రీశైలం నియోజకవర్గంలోని 5 మండలాలైన శ్రీశైలం, ఆత్మకూరు, వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాల్లోని సచివాలయాలకు ప్రభుత్వం రూ.20 లక్షల చొప్పున మంజూరు చేసింది. వీటితో ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయి. ఈ నిధులతో ముఖ్యంలో సీసీ, బీసీ రోడ్లు, నూతనంగా రోడ్లు ఏర్పాటు చేస్తుండడంతో రహదారులు కొత్తశోభను సంతరించుకున్నాయి.




అధ్వానంగా కురుకుంద రహదారి




నూతన బీటీ రోడ్డు వేస్తున్న దృశ్యం

**బాగుపడ్డ గ్రామీణ రహదారులు**

శ్రీశైలం నియోజకవర్గంలోని 58 గ్రామపంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ పాలనలో రహదారులు అభివృద్ధి వైపు పరుగులు తీశాయి. ఆత్మకూరు మండలంలో కురకుంద-ఆత్మకూరు బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.20 లక్షలు, కొట్టాలచెర్వు, కురుకుంద, కరివేన, సిద్ధపల్లి, ముష్టపల్లి తదితర గ్రామాల్లో సీసీ రోడ్లు, వెలుగోడు మండలంలో గుంతకందాలలో సీసీరోడ్లు, బాసుముక్కల - కొత్తరామాపురం రూ.30 లక్షలతో , వెలుగోడు- అబ్దుల్లా పురం గ్రామాలకు రూ 20 లక్షలతో బీటీ రోడ్డు పనులు చేపట్టారు. వీటితో పాటు ఆయా గ్రామాల్లోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు ఏర్పాటయ్యాయి. బండిఆత్మకూరు మండలంలో రూ.2 కోట్ల 66 లక్షలతో బోధనం- పెద్ద దేవుళాపురం, పెద్దదేవుళాపురం -పడమటూరు, పడమటూరు- సంతజూటూరు, సింగవరం-కొత్తపల్లి, ఎ.కోడూరు- ఈర్నపాడు గ్రామాల్లో నూతన బీటీ రోడ్లు వేశారు. ఈర్నపాడు-పెద్దదేవులాపురానికి రూ.14 లక్షలతో సీసీ రోడ్లు పూర్తయ్యాయి. మహానంది మండలంలో బొల్లవరం రూ.29 లక్షలు, బుక్కాపురం రూ.40 లక్షలు, తిమ్మాపురం రూ.15 లక్షలు, సీతారామాపురం రూ.25లక్షలు, గోపవరం రూ.68 లక్షలు, గాజులపల్లి రూ.62.50 లక్షలు, మసీదుపురంలో రూ.75 లక్షలతో రహదారి పనులు చేపట్టారు. ఇలా నియోజకవర్గంలో కోట్ల రూపాయలతో రోడ్డు పనులు పూర్తయ్యాయి.

**ఇంకా పలు గ్రామాల్లో సీసీ రోడ్లు**



గ్రామీణ ప్రాంతల్లో నూతన రహదారులతో కొత్త అందాలు చేకూరాయి. పలు చోట్ల గ్రామాల్లో లక్షల రూపాయలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వెచ్చించడంతో రహదారులు బాగుపడ్డాయి. సీసీ రోడ్లు, బీటీ రోడ్ల పనులు పలు గ్రామాల్లో పూర్తయ్యాయి. ఇంకా పలు గ్రామాల్లో రోడ్లు వేయాల్సి ఉంది. త్వరలోనే ఆ గ్రామాల్లో కూడా అభివృద్ధి పనులు చేపడతాం.

-శ్రీనివాసులు, పంచాయతీ రాజ్ ఏఈ, ఆత్మకూరు

**రహదారి సమస్యలు తీరుతాయి**



మాది కురుకుంద గ్రామం. ఆత్మకూరు నుంచి కురుకుంద రావాలంటే రహదారి అధ్వానంగా ఉండడంతో ఇబ్బంది పడ్డాం. వర్షాకాలం వర్షపు నీటి వలన గుంతలు పడిపోయింది. ప్రస్తుతం పీఆర్‌సీ ద్వారా నిధులను ప్రభుత్వం మంజూరు చేయడంతో మా గ్రామానికి బీటీ రోడ్డు వేశారు. రహదారి బాగుపడడంతో రహదారి సమస్యలు తప్పాయి.

- బందెలమాబు, కురుకుంద

**అభివృద్ధివైపు గ్రామాలు**



మాది వడ్లరామాపురం గ్రామం. మా గ్రామంలో సీసీ రోడ్లు వేశారు. గతంలో కాలనీలో సరైన రహదారి లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నూతన రహదారులు వేయడంతో ఆయా కాలనీ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి వైపు పరుగులు తీస్తున్నాయి.

- శేషిరెడ్డి, వడ్లరామాపురం

### శనగ విక్రయాలకు పేర్లు నమోదు చేసుకోండి

**జూపాడుబంగ్లా:** శనగల విక్రయానికి రైతులు గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ కృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని తర్తూరు, పారుమంచాల గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన రబీ ఈ-క్రాప్ నమోదు, ఈ-కేవైసీ ప్రక్రియను పరిశీలించి మిగిలిన రైతులతో కూడా త్వరగా పూర్తి చేయించాలని ఆర్బీకేల సిబ్బందికి సూచించారు. అలాగే ఈకేవైసీ పూరైన శనగ రైతులు దాన్యం విక్రయించుకునేందుకు వీలుగా వారి వివరాలు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

### సాధనతోనే సత్ఫలితాలు

**మిడుతూరు:** విభిన్న ప్రతిభావంతు (దివ్యాంగుల చిన్నారులు)లకు క్రమం తప్పకుండా సాధన చేయడం ద్వారా సత్ఫలితాలు వస్తాయని ఎంఈఓ మౌలాలి అన్నారు. మంగళవారం స్థానిక మండల భవిత కేంద్రంలో దివ్యాంగుల చిన్నారులకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ క్యాంపును తనిఖీ చేశారు. ఫిజియోథెరపిస్టు శ్రీధర్ , ఐఈఆర్టీ మియాబాషా పాల్గొన్నారు.

### 'బీజేపీ పాలనకు చరమగీతం పాడాలి'

**ఆత్మకూరు:** దేశంలో బీజేపీ పాలనకు ప్రజలకు చరమగీతం పాడాలని నంద్యాల జిల్లా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏసురత్నం పిలుపునిచ్చారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాల్‌లో మంగళవారం ఆ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాయడం వలన నిరుద్యోగ సమస్య అధికమైందన్నారు.

## దేశభాషలందు తెలుగు లెస్స



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత

**జూపాడుబంగ్లా:** దేశభాషలందు తెలుగు లెస్స అన్న శ్రీకృష్ణదేవరాయలవారి మాటలు అక్షరసత్యమని నందికొట్కూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత అన్నారు. మంగళవారం కళాశాలలో ఆంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు, రచయిత, కవి, వ్యాఖ్యాత ఎస్‌ఎండీ ఇనయతుల్లాకు శాలువాకప్పి సన్మానించారు. కార్యక్రమంలో తెలుగుశాఖ అధ్యక్షుడు అన్వర్‌హుసేన్, అధ్యాపకుడు ఖాజాహుసేన్, వైస్ ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

**ఆత్మకూరు:** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ వెంకటనరసయ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

**మాతృభాషను ప్రేమించు**

**శ్రీశైలంప్రాజెక్ట్:** మాతృభాషను ప్రేమించడంతో పాటు ఇతర భాషలను గౌరవించాలని శ్రీశైలం ప్రభుత్వ డిగ్రీక ళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.హుస్సేన్ బాషా అన్నారు. మంగళవారం స్థానిక కళాశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తెలుగు భాష ఔనత్యాన్ని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.రాజన్న, డా.బుచ్చయ్య, నిర్మల, ఉన్నూరు సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా మాతృ బాషా దినోత్సవం**

**పగిద్యాల:** స్థానిక భవితా కేంద్రంలో మంగళవారం ఎంఈఓ సుభాన్ ఆధ్వర్యంలో మాతృ బాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగు బాషా అభ్యున్నతి కోసం గిడుగు రామ్మూర్తి చేసిన సేవలను ఎంఈఓ కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ ఎం చంద్రశేఖర్‌బాబు, మధుసూదన్‌రెడ్డి, ఐఈ ఆర్టీలు రామక్రిష్ణయ్య, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సేవకుడిపై దాడి



దాడిలో గాయపడిన గ్రామసేవకుడు తిరుపాలు

**మిడుతూరు:** మండల పరిధిలోని దేవనూరు గ్రామంలో గ్రామసేవకుడిపై ఆదే గ్రామానికి చెందిన ఓ రైతు దాడికి పాల్పడిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మారుతీ శంకర్ తెలిపిన వివరాల మేరకు .. దేవనూరు గ్రామసేవకుడిగా విధులు నిర్వహిస్తున్న తిరుపాలు తండ్రి సంజన్న బతికి ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన అల్తాఫ్‌కి మూడు ఎకరాల డీ పట్టా పొలాన్ని అమ్మాడు. ఆ పొలాన్ని కొనుగోలు చేసిన అల్తాఫ్ పూర్తి అనుభవంలో ఉన్నాడు. అయితే ఆ పొలాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని గ్రామసేవకుడైన తిరుపాలును పలుమార్లు అడిగాడు. ఆన్‌లైన్ విషయంతో తనకు సంబంధం లేదని చెప్పడంతో మనసులో పెట్టుకొని అల్తాఫ్ తరచు వాగ్వాదం చేసేవాడు. ఆ క్రమంలో మంగళవారం ఉదయం దేవనూరు బస్టాండ్‌లో ఉండగా తిరుపాలు వద్దకు వచ్చి దుర్భాషలాడుతూ, రాడ్డుతీసుకొని దాడిచేశాడు. ఆదే గ్రామానికి చెందిన దీవనాయుడు, చిన్న అయ్యన్న మరికొందరు వచ్చి వీఆర్‌ఏను కాపాడి భార్య, కూతురు సహాయంతో ఇంటికి చేర్చారు. అనంతరం బాధితుడు మిడుతూరు వైద్యశాలకు వెళ్లి వైద్యం చేయించుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## దుకాణాలు బినామీలకు ఇస్తే చర్యలు

**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైలంలోని లలితాంబా వాణిజ్య సముదాయంలో దుకాణాలు పొందిన వారు తమ షాపులను బినామీలకు ఇస్తే చర్యలు తప్పవని శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లక్కీడిప్, టెండర్ల ద్వారా లలితాంబా వాణిజ్య సముదాయంలో దుకాణాలు పొందిన దుకాణదారులు వారే స్వయంగా వ్యాపారాలు నిర్వహించుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అలా కాకుండా ఇతరులకు అద్దెలకు ఇచ్చుకోవడం, బినామీలతో నడుపుకోవడం వంటివి చేస్తే దేవదాయ చట్టం ప్రకారం తగు చర్యలు చేపడతామని, అవసరమైతే దుకాణాల లీజును సైతం రద్దు చేసేందుకు వెనకాడబోమని హెచ్చరించారు. అలాగే లలితాంబా వాణిజ్య సముదాయంలో స్థానిక చెంచులకు 30దుకాణాలు కేటాయించామని అన్నారు. చెంచులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆదేశాల మేరకు తక్కువ అద్దెతో, లక్కీడిప్ ద్వారా దుకాణాలు కేటాయించామని తెలిపారు. అలాగే చెంచులు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు బ్యాంకుల ద్వారా రుణాలు సైతం ఇప్పిస్తామని చెప్పారు.

### కార్మికులను ఆదుకోండి

**జూపాడుబంగ్లా:** చేతివృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులను ఆదుకోవాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు నరసింహులు కోరారు. ఈ మేరకు మంగళవారం కార్మికులతో కలిసి ఎమ్మెల్యే తొగురు ఆర్థర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి నోటీసులు, ముందస్తు సమాచారం ఇవ్వకుండా నందికొట్కూరు పట్టణంలోని పాండురంగస్వామి గుడివద్ద కార్మికులు ఏర్పాటు చేసుకున్న బంకులను తొలగించటం సమంజసం కాదన్నారు. చిన్నపాటి బంకులు ఏర్పాటు చేసుకొని మెకానిక్, వెల్డింగ్ వంటి పనులు చేసుకొంటూ జీవిస్తున్న కార్మికుల కడుపు కొట్టడం తగదన్నారు. కార్యక్రమంలో గోపాల్, షేక్షావలి, సర్వేశ్వరుడు, రామదాసు, శివకుమార్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వసంతోత్సవ పూజలు



ఉత్సవ మూర్తుల గ్రామోత్సవ దృశ్యం

**బండిఆత్మకూరు:** ఓంకార క్షేత్రంలో భక్తిశ్రద్ధలతో వసంతోత్సవం, నాగవల్లి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో బాగంగా చివరి రోజు మంగళవారం పూజారులు శాస్త్రోక్తకంగా అంగరంగ వైభవంగా వసంతోత్సవ పూజలు జరిపించారు. భక్తులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో గడిపారు. తర్వాత శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పంచబుగ్గల కోనేరులోకి తీసుకెళ్లి పూజారులు పూజలు నిర్వహించారు. ఆదదంపతులకు నాగవల్లి పూజలు చేశారు. బుధవారం ఉత్సవ విగ్రహాలు బండిఆత్మకూరులోని శివాలయం వద్దకు గ్రామోత్సవం నడుమ తీసుకెళ్లడానికి ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఈఓ నాగప్రసాద్, విశ్వనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెద్దకొట్టాల వృషభాల జయకేతనం



విజేతలకు బహుమతి అందిస్తున్న దాతలు

**మహానంది:** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానందిలో మంగళవారం జరిగిన న్యూకేటగిరీ విభాగం పోటీలు రసవత్తరంగా సాగాయి. శ్రీశైలం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, ఏపీ ఒంగోలు జాతి పశుపోషకుల రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల శివనాగిరెడ్డి పాల్గొన్నారు. పోటీల్లో నంద్యాల జిల్లా పెద్ద కొట్టాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి వృషభాలు మొదటిస్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా బురుజుపల్లికి చెందిన ఎర్రమల సోహిత్‌రెడ్డి వృషభాలు ద్వితీయస్థానం, నంద్యాల జిల్లా జిల్లెల్లకు చెందిన గొటిక రవితేజేశ్వరరెడ్డి ఎద్దులు తృతీయస్థానం, వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ద్వార్షల గురివిరెడ్డి వృషభాలు నాలుగు, వైఎస్సార్ జిల్లా మైదుకూరుకు చెందిన కేవీఎస్ బుల్స్, కుర్రవెంకటేశ్ యాదవ్ ఎడ్లు ఐదోస్థానం సాధించాయి. మొదటి బహుమతి రూ. 60వేలను దాత నంద్యాలకు చెందిన బాచం నాగేశ్వరరెడ్డి, రెండో బహుమతి రూ. 50వేలు జూపల్లి ప్రభాకర్‌రెడ్డి, మూడో బహుమతి రూ. 40వేలు గాజులపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత గజ్జా పెద్దపక్కీరయ్య, నాలుగవ బహుమతి రూ. 30వేలు కొర్రపోలు భాస్కర్‌రెడ్డి, మసీదుపురం నవీన్‌రెడ్డిలు, ఐదో బహుమతిగా రూ. 20వేలను మసీదుపురం సర్పంచ్ కాకనూరు లక్ష్మీరెడ్డి, ఎంపీటీసీ మునగాల మల్లికార్జునరెడ్డి అందించారు. కార్యక్రమంలో మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, కమిటీ నిర్వాహకులు కుంచపు శ్రీనివాసులు, కందుల రఘురామిరెడ్డి, జయసింహారెడ్డి పాల్గొన్నారు.

### వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా ప్రచారం

**కొత్తపల్లి:** పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మీ మొదటి ప్రాదాన్యత ఓటును వేయాలని జెడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సింగారం వెంకటరమణ (రంగా), కో-ఆప్టెడ్ సభ్యుడు మహమ్మద్ గౌస్ కోరారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో రవీంద్రారెడ్డి తరఫున ప్రచారం నిర్వహించారు. ఎంపీడీఓ మేరితో పాటు ఉద్యోగులకు కరపత్రం అందించి తమ మొదటి ప్రాధాన్యత ఓటును వెన్నపూస రవీంద్రారెడ్డికి వేయ్యాలని కోరారు. మార్చి 13వ తేదీన జరిగే పోలీంగ్‌లో పట్టభద్రులు తమ విలువైన ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

### కోలుకోలేక వ్యక్తి మృతి

**మహానంది:** మహానందిలో జరిగిన శివరాత్రి బ్రహ్మోత్సవాలను తిలకించి ఇంటికి వెళ్లే క్రమంలో మెట్ట వద్ద బస్సు దిగి వెళ్తుండగా బైక్ ఢీకొనడంతో గాయపడిన బుక్కాపురం గ్రామానికి చెందిన ముడుమల గురువయ్య(66) కోలుకోలేక మంగళవారం మృతిచెందాడు. వివరాలు.. గురువయ్య మహానందిలో జరిగే ఉత్సవాలకు సోమవారం వెళ్లాడు. ఇంటికి తిరిగి వెళ్లే క్రమంలో మెట్ట వద్ద బస్సు దిగి వెళ్తుండగా దొర్నిపాడు మండలం గుండుపాపలకు చెందిన ప్రసాదరెడ్డి బైకు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం నంద్యాల ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి కుమారుడు గురువయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మహానంది పోలీసులు తెలిపారు. మృతుడి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

### 24న వాహనాల వేలం

**ఆత్మకూరు:** పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 24న వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ జి.నాయుడు మంగళవారం తెలిపారు. నాటుసారా, అక్రమ మద్యం కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆధార్, పాన్‌కార్డు అందజేసి ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

### వివాహిత ఆత్మహత్య

**వెలుగోడు:** వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన మహబూబ్‌బాషా సతీమణి ఆస్మీ(27) ఇంట్లో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జగన్ మోహన్ తెలిపారు. కారణాలు తెలియాల్సి ఉంది.

### ప్రతి రోజూ 'స్పందన'లో పాల్గొనాలి

**బండిఆత్మకూరు:** సచివాలయ ఉద్యోగులు ప్రతి రోజూ మూడు గంటలకు నిర్వహించే స్పందన కార్యక్రమంలో పాల్గొనాలని ఎంపీడీఓ వాసుదేవ గుప్తా సచివాలయ మహిళా కానిస్టేబుళ్లకు సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మహిళా కానిస్టేబుళ్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ అక్బర్, మహిళా కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# కంచె చేను మేస్తోంది!

- యథేచ్ఛగా ఎర్రమట్టి అక్రమ తరలింపు
- కాపలాదారులే దళారులుగా మారి విక్రయిస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు



అక్రమంగా తరలించేందుకు మట్టి తవ్విన దృశ్యం

**పాములపాడు:** వెలుగోడు రిజర్వాయర్ మరమ్మతుల నిమిత్తం ఉంచిన ఎర్రమట్టిని కొందరు అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కంచే చేను మేస్తున్న చందగా కాపలా నిమిత్తం నియమితులైన వారే దళారుల అవతారం ఎత్తడం, చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

**200 ఎకరాల భూమి కొనుగోలు**

1985వ సంత్సరంలో అప్పట్లో తెలుగు గంగ నిర్మాణం పనుల్లో వీబీఆర్ (వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్)నిర్మాణం జరిగింది. వీబీఆర్ అనకట్ట మట్టి కోసం మండలంలోని బానుముక్కల గ్రామ రైతుల నుంచి దాదాపు 200 ఎకరాల భూమిని అప్పటి ప్రభుత్వం కారు చౌకగా కొనుగోలు చేసింది. రిజర్వాయర్ నిర్మాణం పూర్తి అయినప్పటికీ భవిష్యతు మరమ్మతుల నిమిత్తం కొన్ని ఎకరాల భూమిని ఉంచేశారు. ఆ భూములకు కాపలాదారులుగా కొందరిని నియమించారు. అయితే ఇప్పుడు వారే డబ్బు పుచ్చుకొని అక్రమ మట్టి రవాణాకు సహకరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**చుట్టు పక్కల ప్రాంతాలకు తరలింపు**

ఆత్మకూరు, పాములపాడు, వెలుగోడు ప్రాంతాల్లో జరుగుతున్న వివిధ పనులకు మట్టి అవసరమైనప్పుల్లా గుత్తేదారులు బానుముక్కల గ్రామంలో వీబీఆర్ కోసం రిజర్వ్ చేసిన భూమిలోని మట్టిని తరలించుకుంటున్నారు. ఈ విషయం తెలిసినప్పటికి అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. బానుముక్కల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జేసీబీ, ట్రాక్టర్లను ఏర్పాటు చేసి గుత్తేదారులకు ఒప్పందాలు చేసుకొని మట్టిని రాత్రి వేళల్లో తరలిస్తూ సొము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

**వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను పంపిస్తున్నాం**

బానుముక్కల భూముల వైపు ప్రతి రోజు వర్క్ఇన్‌స్పెక్టర్ పంపిస్తున్నాం. మట్టి తరలిస్తున్నట్లు తమకు ఫిర్యాదు వచ్చింది. గతంలో కూడా మట్టి తరలించిన వారిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. ఇప్పుడు మనిషిని పంపించా. అక్రమంగా తరలించే వారి పై కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

-రమేష్‌బాబూజీ, డీఈ, టీజీపీ


**అధికారుల నిర్లక్ష్యంతో అక్రమ తరలింపు**



బానుముక్కల, కొత్తరామాపురం గ్రామాల రైతాంగం తమ విలువైన భూములను కారుచౌకగా ప్రభుత్వానికి అప్పగించారు. భవిష్యత్ పనులను మట్టిని నిల్వ ఉంచుకోవాల్సిన అధికారులు కాసులకు కక్కుర్తి పడుతున్నట్లుంది. రోడ్లకు యథేచ్ఛగా మట్టిని అమ్ముకుంటున్నారు. పలు మార్లు ఫిర్యాదులు చేసినప్పటికి పట్టించుకోకపోవడంలో ఆంతర్యమేమిటో అర్థమవుతోంది.

-సుధాకర్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి

**విలులైన భూములను కోల్పోయాం**



అప్పట్లో పనికిరావనుకొని తక్కువ ధరలకే రైతులు భూములను ఇచ్చేశారు. సిద్దాపురం చెరువు ఎత్తిపోతల పథకం ద్వారా సాగు నీరు వస్తుండటంతో ప్రస్తుతం ఆ భూములు లక్షలు వెచ్చించినా దొరకని పరిస్థితి. అలాంటి భూముల్లో అక్రమ మట్టి తరలింపుకు అధికారులు చర్యలు తీసుకొని అడ్డుకట్ట వేయాలి.

-స్వామిరెడ్డి, రైతు, బానుముక్కల

### మానవత్వం చాటుకున్న ఎస్‌ఐ

**జూపాడుబంగ్లా:** నందికొట్కూరు మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు ఎస్‌ఐ ఓబులేసు విధుల్లో భాగంగా మంగళవారం ఉదయం గ్రామంలో పర్యటిస్తుండగా ఓ వ్యక్తి అకస్మాత్తుగా కిందపడి కొట్టుకోసాగాడు. గమనించిన ఎస్‌ఐ వెంటనే అతని వద్దకు వెళ్లాడు. ఫిట్స్ వచ్చినట్లుగా గుర్తించి అతను కోలుకునేలా సపర్యలు చేశారు. మెరుగైన చికిత్స నిమిత్తం అతన్ని కర్నూలు ఆసుపత్రికి తరలించి వైద్యపరీక్షలు అందించి మానవత్వం చాటుకున్నారు. ఎస్‌ఐని గ్రామస్తులు ప్రశంసించారు.

### తిరుమలకు పాదయాత్ర

**మిడుతూరు:** స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం నుంచి దాదాపు 200 మంది భక్తులు తిరుమలకు పాదయాత్రగా మంగళవారం బయలుదేరారు. ప్రతి ఏటా ఫిబ్రవరి మాసంలో మిడుతూరు నుంచి తిరుమల తిరుపతి దేవస్థానానికి భక్తులు పాదయాత్రగా బయలుదేరి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పాదయాత్రను ప్రారంభించారు.